క్లుప్తంగా

నేడు బొమ్మల విక్రయకేంద్రం ప్రారంభం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి బొమ్మల హస్తకళాకారుల కోసం నూతనంగా నిర్మించిన బొమ్మల విక్రయ, కళాకారుల శిక్షణ కేంద్ర ప్రారంభోత్సవం గురువారం జరగనుంది. కేంద్రం ఎంపీ నిధుల నుంచి రూ.2.29 కోట్లతో భవన నిర్మాణం ఇటీవల నిర్మించారు. స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తో కలసి ఎంపీ కేశినేని నాని, జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు నూతన భవనం ప్రారంభించనున్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

మైలవరం: పట్టణంలో రెండో సచివాలయం పరిధిలో రూ.20 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రహదారుల నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మైలవరం పట్టణంలో ప్రజల సౌకర్యార్థం మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

9న జాతీయ లోక్‌అదాలత్

నూజివీడు: స్థానిక కోర్టు ప్రాంగణంలో వచ్చే నెల 9న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ బుధవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే ఈ లోక్‌అదాలత్‌లో సివిల్ కేసులు, పరిష్కరించదగిన క్రిమినల్ కేసులు, చెక్కు బౌన్స్, మనోవర్తి, గృహహింస, మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్ తదితర కేసులను రాజీమార్గంలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కక్షిదారులందరూ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జడ్జి విజ్ఞప్తి చేశారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

త్రిలోచనాపురం(ఇబ్రహీంపట్నం): వరి పైరులో యాజమాన్య పద్ధతులు రైతులు పాటించాలని మండల వ్యవసాయశాఖ అధికారి డి.శైలజ కోరారు. మండలంలోని త్రిలోచనాపురంలో డాక్టర్ వైఎస్సార్ పొలం బడిలో భాగంగా వరి పొలాలు క్షేత్రస్థాయిలో ఆమె బుధవారం పరిశీలించారు. భాగస్వామ్య కార్యాచరణ ప్రణాళికలో భాగంగా 20 శాతం అదనపు పిలకల తొలగింపు, 25 నుంచి 50 శాతం ఆకుల కత్తిరింపు విధానంపై అవగాహన కల్పించారు. ప్రస్తుత పరిస్థితుల్లో మిత్ర పురుగులైన సాలీడు, తూనీగలు ఎక్కువగా ఉన్నందున క్రిమిసంహారిక మందులు వాడాల్సిన అవసరం లేదన్నారు. పోషక కణజాలమైన ధారువు, నాళము పనితీరు క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మకంగా చూపించారు. విస్తరణాధికారి రజిని, ఏఏఓలు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ముసునూరు: ముసునూరు, చాట్రాయి మండలాల సరిహద్దులోని లోపూడిలో కొలువైన ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. వైస్ ఎంపీపీ కోటగిరి రాజానాయన జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్, గ్రామ సర్పంచ్ పేరం కృష్ణతో కలిసి ముత్యాలమ్మ వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

జయహో భారత్



చంద్రయాన్ విజయవంతమైనందుకు ఎమ్మెల్యే రక్షణనిధి అభినందనలు



నూజివీడు చిన్నగాంధీబొమ్మ సెంటర్లో త్రివిధ హైస్కూల్ విద్యార్థుల ప్రదర్శన

చంద్రయాన్ విజయవంతంపై హర్షాతిరేకాలు

తిరువూరు: ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్–3 విజయవంతంగా చంద్రమండలంపై దిగిన సందర్భంగా తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. లక్ష్మీపురంలో బుధవారం జరిగిన నియోజకవర్గ సచివాలయ కన్వీనర్ల సమావేశంలో రాష్ట్ర ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతమ్‌రెడ్డితో కలిసి జాతీయ జెండాకు గౌరవవందనం సమర్పించి, చంద్రయాన్ విజయవంతం కావడానికి కృషి చేసిన శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. తిరువూరు పట్టణ మోటార్ మెకానిక్ వర్కర్స్ యూనియన్, విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

నూజివీడులో..

నూజివీడు: చంద్రయాన్–3 విజయవంతం కావాలంటూ స్థానిక త్రివిధ హైస్కూల్ విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. చిన్నగాంధీబొమ్మ సెంటర్‌లో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సబ్బినేని శ్రీనివాస్ మాట్లాడుతూ చంద్రయాన్–3 ప్రయోగం చారిత్రాత్మక ఘట్టమన్నారు.

తిరువూరులో ప్రదర్శన

తిరువూరు: ప్రపంచం గర్వించదగిన చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావాలని కోరుతూ తిరువూరు సిద్ధార్థ స్కూలు విద్యార్థులు బుధవారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. భారత శాస్త్రవేత్తలు అత్యంత వ్యయప్రయాసల కోర్చి రూపొందించిన చంద్రయాన్ విజయవంతమై దేశ ఖ్యాతి ఇనుమడించాలని ఆకాంక్షిస్తూ ప్లకార్డులు, బ్యానర్లతో ప్రదర్శనలో పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంటు చక్రపాణి, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.



తిరువూరు మోటార్ మెకానిక్ వర్కర్స్ యూనియన్ అభినందనలు



తిరువూరులో చంద్రయాన్ విజయవంతం కావాలని ప్రదర్శన

తోటమూల(గంపలగూడెం): చంద్రయాన్–3 విజయవంతం కోరుతూ గంపలగూడెం మండలం తోటమూల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ప్రదన్శనను ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు ప్రారంభించారు. భైభారత్, జై ఇస్రో.. జయహో భారత్ అంటూ ప్లకార్డులను చేతబూని విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గంపలగూడెం మండలం తోటమూలలో కేజీబీవీ విద్యార్థుల ప్రదర్శన

సచివాలయ కన్వీనర్లకు బీమా సదుపాయం

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం: గ్రామ సచివాలయాల కన్వీనర్లకు బీమా సదుపాయం కల్పించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. స్థానిక ఎస్వీఎస్ కల్యాణ మండపంలో బుధవారం గ్రామ సచివాలయాల కన్వీనర్లతో సమావేశం జరిగింది. సచివాలయ కన్వీనర్ల బాధ్యత ఎంతో కీలకమైనదని, అందరూ ఐకమత్యంతో పనిచేసి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి ఒక లబ్ధిదారుకు అందేలా చూడాలన్నారు. తద్వారా మళ్ల 2024 ఎన్నికల్లో జగనన్న ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అందరూ సమష్టిగా పని చేసి వైఎస్సార్ సీపీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. సచివాలయ కన్వీనర్ల వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా తమ పార్టీ అధినాయకత్వం అడుగులు వేస్తుందన్నారు. అందరూ విధిగా బీమా నమోదు చేయించుకోవాలన్నారు. మైలవరం నియోజకవర్గంలో రూ.950 కోట్లు సంక్షేమానికి వెచ్చించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 20వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. సచివాలయ భవనాలు, వెల్‌నెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలు, నాడు–నేడు కింద పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రులు అభివృద్ధి, సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. వచ్చే వారంలో గడప గడపకు కార్యక్రమం మన ప్రభుత్వం కార్యక్రమం తిరిగి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు పడమటి సురేష్‌బాబు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, సురేష్‌బాబు

జిలానీ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన అబ్దుల్ ఖాదర్ జిలానీ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ బుధవారం పరామర్శించారు. జిలానీ కుటుంబ సభ్యులు సూఫీ మత గురువు మహ్మద్ అల్తాఫ్‌రజా, ముక్తార్, ఫారూక్, అస్రఫ్, తారూక్ రహ్మత్ పర్వీన్‌లను పరామర్శించారు. మరో కార్యక్రమంలో డాక్టర్ దేవదాసురెడ్డి కుమారుడు మధుకిరణ్‌రెడ్డి ఈ మధ్య కాలంలో మరణించిన విషయం తెలుసుకుని ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఎంపీపీ పొలడుగు జోత్స్న, వార్డు కౌన్సిలర్‌లు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మూడు చక్రాలమోటార్ సైకిల్ అందజేత

మైలవరం: మండలంలోని పుల్లూరు గ్రామానికి చెందిన దివ్యాంగుడు చల్లా గంగరాజుకు ప్రభుత్వం మంజూరు చేసిన మూడు చక్రాల మోటార్ వాహనాన్ని బుధవారం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అందజేశారు. మైలవరంలోని ఎస్వీఎస్ కళ్యాణ మండపంలో జరిగిన సచివాలయ కన్వీనర్ల సమావేశానికి హాజరైన స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ వాహనాన్ని అందజేశారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి

తిరువూరు: పేదల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో సచివాలయాల కన్వీనర్ల నియోజకవర్గ స్థాయి సమావేశం ఎమ్మెల్యే రక్షణనిధి అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలతో ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువయ్యాయన్నారు. నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పలు పథకాలు సామాజిక అసమానతలు తొలగించాయన్నారు. పేదలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు పలు పథకాలు తోడ్పడుతున్నాయని, ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతున్నాయని గౌతమ్‌రెడ్డి వెల్లడించారు. సచివాలయాల కన్వీనర్లు, సారథులు వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేయడానికి కృషి చేయాలన్నారు. కన్వీనర్లకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి మాట్లాడుతూ తనను రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించి ఆదరించిన తిరువూరు నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, మండల పరిషత్ అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యులు, సచివాలయాల కన్వీనర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌతమ్‌రెడ్డి

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌పై టాంటాం వేయించాలి

నూజివీడు: ఆగిరిపల్లి మండల గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించే ముందురోజే ఆ గ్రామంలో టాంటాం వేయించి ప్రజలకు తెలియజేయాలని ఎంపీడీఓ పి.శంకర్‌రావు బుధవారం తెలిపారు. పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, వలంటీర్ల ద్వారా గ్రామస్తులకు తెలియజేయాని పేర్కొన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ షెడ్యూల్‌ను ప్రతి పంచాయతీ కార్యాలయంలో ప్రదర్శించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ నిర్వహించే గ్రామాల్లో ఆ రోజు గ్రామంలో ఉన్న పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను వైద్యులు, ఎంఈఓ–2, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు సందర్శించి అనారోగ్యంతో ఉన్న పిల్లలకు వైద్య చికిత్స అందించాలని పేర్కొన్నారు. వీరంతా వచ్చేలోగా ఉపాధ్యాయులు అనారోగ్యంగా ఉన్న పిల్లల వివరాలను సేకరించి ఉండాలని పేర్కొన్నారు.

స్వామిత్వ సర్వే పరిశీలన

చంద్రుపట్ల (విస్సన్నపేట): మండలంలోని చంద్రుపట్ల గ్రామంలో స్వామిత్వ సర్వేపనులను ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ బుధవారం పరిశీలించారు. స్వామిత్వ సర్వే పనులు చివరి దశలో ఉన్నాయని సర్వే పూర్తయిన వెంటనే గ్రామంలో ప్రతి ఇంటికి, భూములకు స్వామిత్వ కార్డులు జారీ చేయనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాలకొండయ్య, కార్యదర్శి మురళి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్హులైన వారు దరఖాస్తు చేయండి

పెనమలూరు: ఏపీ సమగ్ర శిక్ష సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న కస్తుర్బా పాఠశాలలో పలు పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేయాలని సమగ్ర శిక్ష అడిషనల్ కోఆర్డినేటర్ జి. మహేశ్వరరావు తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ ఎ.కొండూరు బాలికల పాఠశాలలో అసిస్టెంట్ కుక్, గంపలగూడెంలో డే వాచ్‌మెన్ పోస్టుకు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేయాలని కోరారు. పై రెండు పోస్టులకు 7వ తరగతి పాస్ అయ్యి ఉండాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 26వ తేదీన సాయంత్రం 5 గంటలకు దరఖాస్తు, మార్కుల జాబితా జత చేసి విజయవాడ ఎంకేబేగ్ హైస్కూల్, విజయవాడ సమగ్రశిక్ష కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

టంగుటూరి సేవలు ఆదర్శనీయం



టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ



తిరువూరులో టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

జి.కొండూరు: ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీతో పాటు ఎంపీడీఓ అనూరాధ, అధికారులు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

టంగుటూరికి ఘన నివాళి

తిరువూరు: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన చిత్రపటానికి బుధవారం ఘనంగా నివాళులర్పించారు. భాషా ప్రయుక్త రాష్ట్ర ఏర్పాటుకు విశేషకృషి చేసిన టంగుటూరి తెలుగు ప్రజల గుండెల్లో చిరకాలం నిలిచి ఉంటారని కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ పేర్కొన్నారు.

ముసునూరులో..

ముసునూరు: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ధైర్య సాహసాలే మనకు ఆదర్శమని జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్ పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర తొలిముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా లోపూడి ఆశ్చర్య పాఠశాలలో, మండల పరిషత్ కార్యాలయం వద్ద టంగుటూరి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. బీసీ బాలుర హాస్టల్లో వార్డెన్ షేక్ నజీర్ టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పించారు.



లోపూడిలో టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్

వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ప్రశంసనీయం

మైలవరం: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో దాతల సహకారంతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మైలవరం ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో దాతలు దివంగత నాగులూరి రత్నబాబు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ప్యూరిఫైడ్ మినరల్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ బుధవారం ప్రారంభించారు. దివంగత నాగులూరి రత్నబాబు తృతీయ వర్ధంతి పురస్కరించుకుని ఆయన సతీమణి దేవకి, కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవా దృక్పథంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, సేవా కార్యక్రమాలలో దాతలు పాల్గొని నియోజకవర్గ అభివృద్ధిలో పాలు పంచుకోవాలన్నారు. కార్యక్రమంలో దివంగత రత్నబాబు కుటుంబ సభ్యులు, నాగులూరి బ్రదర్స్, మైలవరం జమీందారు ఎస్వీ నివృతరావు పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, నివృతరావు

విద్యుత్ సరఫరా సమయంలో మార్పులు

చాట్రాయి: వ్యవసాయ విద్యుత్ సరఫరా సమయంలో మార్పులు చేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ బుధవారం తెలిపారు. నూజివీడులో 220కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లో మరమ్మతుల నిమిత్తం ఈ మార్పులు చేస్తున్నామని పేర్కొన్నారు. ఒక ఫీడర్‌లో రాత్రి రెండు గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు రెండో ఫీడర్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామని ఈ వేళలు ప్రతి వారం మారతాయని తెలిపారు. మార్పులను మండలంలోని రైతులు గమనించాలని ట్రాన్స్‌కో ఏఈ కోరారు.

సీఆర్‌రావు మరణం తీరనిలోటు

నూజివీడు: ఆచార్య సీ రాధాకృష్ణారావు (సీఆర్‌రావు) మరణం సాంఖ్యాక (గణాంక) శాస్త్రానికి తీరని లోటని నూజివీడులోని ఎమ్మార్ అప్పారావు కాలేజీ ఆఫ్ పీజీ కోర్సెస్ ప్రిన్సిపాల్ ఆచార్య మండవ వెంకట బసవేశ్వరరావు అన్నారు. సీఆర్‌రావు చిత్రపటానికి బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బసవేశ్వరరావు మాట్లాడుతూ సీఆర్‌రావు నూజివీడులో కూడా విద్యనభ్యసించారని, ఇండియన్ స్టాటికల్ ఇన్‌స్టిట్యూట్‌లో 40 ఏళ్ల పాటు వివిధ రకాల బాధ్యతలను నిర్వహించారని గుర్తుచేశారు. భారత ప్రభుత్వం సీఆర్‌రావు చేసిన సేవలను గుర్తించి 1968లో పద్మభూషణ్‌తో, 2001లో పద్మ విభూషణ్‌తో సత్కరించిందన్నారు. 2002లో జార్జిబుష్ నుంచి నేషనల్ మెడల్ ఆఫ్ సైన్స్ అందుకున్నారని, ఏపీ అకాడమీ ఆఫ్ సైన్సెస్ తరపున ఏపీ అకాడమీ ఫెల్ పురస్కారంతో సత్కరించిందని తెలిపారు.



నూజివీడులో సీఆర్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ బసవేశ్వరరావు

నూజివీడులో సీఆర్డీఏ స్మార్ట్ టౌన్‌షిప్

- ● చ.గజం రూ.8,500 ధర, సులభ వాయిదాల్లో చెల్లింపు
- ● ఈ నెల 31 వరకు ప్లాట్లు బుక్ చేసుకునే అవకాశం

సాక్షి, అమరావతి: మధ్యాదాయ వర్గాల ప్రజలకు అనువుగా నూజివీడులో ఎంఐజీ జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ ఏర్పాటు చేసినట్టు సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చదరపు గజం రూ.8,500 ధర నిర్ణయించామని, సులభ వాయిదాల పద్ధతిలో నగదు చెల్లించుకునే అవకాశాన్ని కల్పించినట్టు పేర్కొన్నారు. మధ్య తరగతి ప్రజలు సౌకర్యవంతంగా స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా ప్లాట్లు అభివృద్ధి చేశామన్నారు.

ఏలూరు జిల్లా నూజివీడు పట్టణంలోని ఎంఆర్ అప్పారావు కాలనీలో మ్యాంగో గార్డెన్ రీసెర్చ్ సెంటర్‌ను ఆనుకొని 40.78 ఎకరాల విస్తీర్ణంలో 150, 200, 250 చ.గ. వైశాల్యంలో 393 ప్లాట్లను అభివృద్ధి చేశామన్నారు. ప్లాట్లకు అధిక డిమాండ్ ఉండడంతో పాటు ప్రజల అభ్యర్థన మేరకు ఈ నెల 31 దరఖాస్తులు చేసుకునే గడువు పొడిగించినట్టు ఆయన తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులకు 20 శాతం రాయితీ

ప్రైమ్ ఏరియాలో ఉన్న ఈ లేఅవుట్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 10 శాతం ప్లాట్లు రిజర్వు చేశామని, ధరలో 20 శాతం రాయితీ కూడా ఇస్తున్నట్టు కమిషనర్ వివేక్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా వీటిని పొందచ్చని, ఇదే నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల కోసం 5 శాతం ప్లాట్లు రిజర్వు చేశామన్నారు. అన్ని మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసిన ప్లాట్లను అమ్మకం ధరలో 10 శాతం మొత్తాన్ని చెల్లించి ప్లాట్‌ను బుక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇతర వివరాలకు https:// migapdtcp. ap. gov. in లేదా https:// crda. ap. gov. in వెబ్‌సైట్‌లో చూడవచ్చని, సందేహాల నివృత్తికి 0866 – 2527124లో సంప్రదించాలని పేర్కొన్నారు.

దోమల నివారణ చర్యలు చేపట్టాలి

విస్సన్నపేట: మండలంలో పలు గ్రామాల్లో వర్షాలు వలన దోమలు ప్రబలి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని, దోమలు నివారణ చర్యలు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి వి.నాగరాజు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ ఎస్.వెంకటరమణకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కోటా కల్యాణ్, మండల కమిటీ సభ్యురాలు ధనలక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన వర్క్‌షాప్

జూపూడి(ఇబ్రహీంపట్నం): నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో మూడురోజులుగా జరుగుతున్న క్లౌడ్ కంప్యూటింగ్ వర్క్‌షాపు బుధవారంతో ముగిసింది. స్పైస్పో సెక్యూరిటీ సొల్యూషన్స్ సంస్థ సౌజన్యంతో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాపులో సంస్థ ప్రతినిధులు చైతన్య రాణి, నాగ సాయికిరణ్ క్లౌడ్ కంప్యూటింగ్‌పై అవగాహన కల్పించారు. శిక్షణ తీసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అక్బర్‌ఖాన్, సయ్యద్ సాదత్ అలీ పాల్గొన్నారు.

భూసమస్యలపై నేడు సదస్సు

నూజివీడు: సీపీఐ బస్సు యాత్ర 24న నూజివీడు విచ్చేస్తున్న సందర్భంగా ఉదయం 10 గంటలకు స్థానిక అమర్ భవన్‌లో రాష్ట్రంలోని భూ సమస్యలపై సదస్సు ఏర్పాటు చేసినట్లు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని రామారావు, సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే జల్లి విల్సన్, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పాల్గొంటారని పేర్కొన్నారు.